## రాజీవ్ గాంధీ 35,వ వర్ధంతి సందర్భంగా నివాళులు

- డిసిసి సెక్రెటరీ పెద్దపుడి సత్యవతి..
- నారాయ ణపురంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ కూల్ డ్రింక్స్ పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు.



3

వాస్తవాలు పలుకు DD9 వార్త
తెలుగు దినపత్రిక
శుక్రవారం 22-05-2026



# రైతుల గోస ఎవరికి పట్టదా..?

## కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోయిన ధాన్యం బస్తాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు పేరుకుపోయి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతాంగం మండిపడుతోంది. తాడ్వాయి, కాటాపురం, నార్లాపురం, గంగారం, మేడారం, కాల్వపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీగా బస్తాలు నిల్వ ఉన్నాయి. రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి నెల రోజులైనా కాంటా వేయకపోవడం, కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- లారీలు రాక రైతుల తీవ్ర ఇబ్బందులు
- రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే రైతుల గస్తీ
- తాడ్వాయి, కాటాపురం, నార్లాపురం కేంద్రాల్లో భారీ నిల్వలు
- మండలవ్యాప్తంగా ఐదు కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు
- మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల వైఫల్యం అంటూ ఆరోపణలు
- ఎంపీడీవో, ఐకేపీ, జిల్లా అధికారులపై రైతుల ఆగ్రహం

2

ఏటూరునాగారం క్రైమ్, డీడీ9 వార్త, మే 21



## ఎద్దు ఏడిసిన వ్యవసాయం..
### రైతు ఏడిసిన రాజ్యం బాగుపడదు

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- తహసీల్దార్‌కు బీజేపీ అంతర్గం మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ వినతి పత్రం

4





## భద్రాద్రిలో భద్రగిరి ప్రదక్షణ

భక్తరామదాసు తూము లక్ష్మీనరసింహదాసులకు ప్రత్యేక పూజలు

4

## యూరియా అన్ లోడింగ్ ప్రక్రియపై డీసీపీ ఆరా!!

- లారీ అసోసియేషన్, అధికారులతో కీలక చర్చలు
- యూరియా సరఫరాలో ఆటంకాలు ఉండకూడదు



4



# రైతుల గోస ఎవరికి పట్టదా..?

## కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోయిన ధాన్యం బస్తాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు పేరుకుపోయి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతాంగం మండిపడుతోంది. తాడ్వాయి, కాటాపురం, నార్లాపురం, గంగారం, మేడారం, కాల్వపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీగా బస్తాలు నిల్వ ఉన్నాయి. రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి నెల రోజులైనా కాంటా వేయకపోవడం, కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- లారీలు రాక రైతుల తీవ్ర ఇబ్బందులు
- రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే రైతుల గస్తీ
- తాడ్వాయి, కాటాపురం, నార్లాపురం కేంద్రాల్లో భారీ నిల్వలు
- మండలవ్యాప్తంగా ఐదు కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు
- మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల వైఫల్యం అంటూ ఆరోపణలు
- ఎంపీడీవో, ఐకేపీ, జిల్లా అధికారులపై రైతుల ఆగ్రహం



**ఏటూరునాగారం క్రైమ్, డీడీ9 వార్త, మే 21**

కాటాపురం గ్రామ కేంద్రంలోనే సుమారు 180 మంది రైతులు 100 నుంచి 300 బస్తాల వరకు ధాన్యాన్ని నిల్వ ఉంచారు. అదే గ్రామంలోని మరో ఐకేపీ కేంద్రంలో కూడా దాదాపు 80 మంది రైతుల ధాన్యం బస్తాలు పేరుకుపోయాయి. మండల వ్యాప్తంగా ఐదు కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

### రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే రైతుల గస్తీ

లారీలు రాకపోవడంతో రైతులు తమ ధాన్యం బస్తాలను కాపాడుకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్దే రాత్రింబవళ్లు గడుపుతున్నారు. నిద్రాహారాలు మాని బస్తాల వద్దే కాపలా కాస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ధాన్యం సీజన్ లో ఇంత నిర్లక్ష్యం ఎప్పుడూ చూడలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకునే వారు ఎవరూ లేరని, అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు.

### అధికారులపై రైతుల ఆగ్రహం

ఎంపీడీవో, ఐకేపీ ఏపీఎం నుంచి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, అదనపు కలెక్టర్ వరకు ఎవరూ సమస్యను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యం తరలింపులో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడుతున్నారు. మరోవైపు క్వింటాకు రూ.3500 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తే కేవలం రూ.2440 మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటకు సరైన ధర లేకపోవడం, తరలింపుకు లారీలు లేకపోవడం రైతులను మరింత ఆర్థికంగా దెబ్బతీస్తోందని అంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కేంద్రాల్లోనే నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి లారీలు ఏర్పాటు చేసి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా నివాళులు

- గోవిందరావుపేటలో రోగులకు పండ్ల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**గోవిందరావుపేట, మే 21 (డి డి 9 వార్త):**

భారత దివంగత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35,వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గోవిందరావుపేట మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడకుల అశోక్ సూచనలతో గురువారం గోవిందరావుపేట బస్టాండ్ ఆవరణలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గోవిందరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవతా సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పాలడుగు వెంకటకృష్ణ మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగంలోకి తీసుకెళ్లిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. దేశంలో కంప్యూటర్, టెలికాం రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. దేశ ఐక్యత, అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన మహానేతగా రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో ఎన్నికల ప్రచార సమయంలో జరిగిన ఉగ్రదాడిలో రాజీవ్ గాంధీ మరణించారని, అప్పటి నుండి మే 21ను దేశవ్యాప్తంగా తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్యతో పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# దమ్మపేట మండలం లో పలు కార్యక్రమాలు లో పాల్గొన్నా బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం

- ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిరూపాలు ఇలవెల్పులు...
- దశదినకర్మల హాజరు అయి చిత్రపటానికీ పుష్పాంజలి అర్పించిన సోయం వీరభద్రం

**అశ్వారావుపేట:మే 21 (డిడి 9వార్త)**

దమ్మపేట (మండలం) కొమ్ము గుడెం( గ్రామం) లో లింగాలపల్లి గ్రామానికి చెంధిన చేపా వారి యిలవేల్పులు కొమ్ముగుడెం గ్రామానికి వచ్చిన సంధర్బంగా గ్రామపెద్దలు, పూజారులు తలపతుల ఆహ్వానం మేరకు స్వామి వారినీ ధర్శించుకున్న అనంతరం సోయం వీరభద్రం గారు మట్లాడుతు ఆదివాసి సంస్కృతి మరియు సంప్రదాయాలుతో వెల్పుల పండగ జరపడం హర్షణీయం అని అన్నారు స్వామి వారి ఆశీర్వాదలు అంధరి పైన ఉండాలి అని భారస నాయకులు సోయం వీరభద్రం గారు అన్నారు

దమ్మపేట (మండలం) కొమ్ము గుడెం వీరన్నపాలెం (గ్రామం) లో



పద్దం కోటేశ్వరరావు గారి దశదిన కర్మలకు హాజరు అయ్యి చిత్రపటానికీ పుష్పాంజలి ఘటించి నివాలులు అర్పించిన భా.ర.స నాయకులు సోయం వీరభద్రం గారు

ఈ కార్యక్రమం లో వెల్పుల తలపతులు చెపా ముక్తేశ్వరరావు,చెపా రాముడు, వాడే.నరసింహారావు ,కోర్సా వెంకటేష్,సోయం నరసింహారావు తధితరులు పాల్గొన్నారు

# కంప్యూటర్ విప్లవానికి రాజీవ్ గాంధీనే పునాది: పరిమి శ్రీనివాస్

- భద్రాచలంలో మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు.. ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

**భద్రాచలం , మే 21 , డిడి9 వార్త**

భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు నడిపించి, కంప్యూటర్ యుగానికి పునాది వేసిన మహోన్నత నాయకుడు మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ అని భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిమి శ్రీనివాస్ కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం భద్రాచలం సాయిబాబా ఆలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరిమి శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా పరిమి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటి యువత ఆస్వాదిస్తున్న ఆధునిక సాంకేతిక





వ్యవస్థ, కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మక మార్పులు, డిజిటల్ భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ దూరదృష్టే ప్రధాన కారణమన్నారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం పెరగాలనే సంకల్పంతో ఆయన అనేక సంస్కరణలు తెచ్చారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

రాజీవ్ గాంధీకి నివాళులర్పించిన వారిలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు బంధం శ్రీనివాస్ గౌడ్, సాయిబాబా, తమ్మళ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి సాంబ, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు అలీమ్, జిల్లా మహిళా కార్యదర్శి పందాల సరిత పాల్గొన్నారు. అలాగే సేవాదళ్ ఏ బ్లాక్ అధ్యక్షుడు అశోక్, మండల సేవాదళ్ అధ్యక్షుడు శీలం రామ్మోహన్ రెడ్డి, కోలపూడి వరుణ్, శ్రీను (చిన్న యేసు), మహిళా నాయకురాలు భోధ మని, సీనియర్ నాయకులు తరుణ్ మిత్రతో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

# బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రావులపల్లి రాంప్రసాద్

**భద్రాచలం, మే 21 డిడి9 వార్త**

బీఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా రావులపల్లి రాంప్రసాద్‌ను పార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. త్వరలో ప్రారంభం కానున్న డిజిటల్ సభ్యత్వ నమోదును విజయవంతంచేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జిలను గురువారం ప్రకటించారు. ఈ క్రమంలో భద్రాచలం నియోకవర్గ ఇన్‌చార్జిగా రావులపల్లి రాంప్రసాద్‌ను నియమించారు. రావులపల్లి



రాంప్రసాద్ నియామకం పట్ల బీఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణతో పాటు ఇతర నాయకులు అభినందనలు తెలిపారు.

# రాజీవ్ గాంధీ 35,వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన డిసిసి సెక్రెటరీ పెద్దపుడి సత్యవతి..

- నారాయణపురంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ కూల్ డ్రింక్స్ పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు.
- రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తి: డిసిసి సెక్రటరీ

**అశ్వరావుపేట మే 21 (డి డి 9 వార్త):**

భారత దివంగత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35,వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ డి సి సి సెక్రెటరీ పెద్దపూడిసత్యవతి ఆధ్వర్యంలో నారాయణపురంలో ఉపాధి హామీ కూలీలు దగ్గర ఘనంగా నివాళులు అర్పించారు నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న సూచనలతో గురువారం నారాయణపురం లో పనిచేస్తున్నఉపాధి హామీ కూలీలు సమక్షంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం నారాయణపురం కార్మికుల కు మజ్జిగ ప్యాకెట్లు కూల్ డ్రింక్స్ పంపిణీ చేసి మానవతా సేవా కార్యక్రమం నిర్వహించారు. సేవలో ముందుండే మనస్తత్వం ఉన్న సత్యవతి పెద్దల మన్ననలతో రెట్టింపు ఉత్సాహంతో కార్యక్రమాలలో ముందుంటారు.

పెద్దపుడి సత్యవతి మాట్లాడుతూ

దేశాన్ని ఆధునిక భారతం గా తీర్చిదిద్దటంలో రాజీవ్ గాంధీ కీలకపాత్ర పోషించారని ఆమె అన్నారు .సమాచార సాంకేతిక రంగం టెలికం విప్లవానికి ఆయన బలమైన పునాది వేశారని పేర్కొన్నారు గ్రామాభివృద్ధి మహిళా సాధికారక, పంచాయతీరాజ్ వ్యవస్థ, బలోపేతం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రజల మధ్య ఉండే నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు దేశ ప్రజలకు ఆశగా ఎదురు చూస్తున్నారని ఆమె తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని వారికి చేదోడు వాదోడుగా మంత్రులు అభివృద్ధి బాటలు వేస్తున్నారని ఆమె ఉపాధి హామీ కూలీలకు అక్కడ పాల్గొన్న నాయకులకు ఆమె తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నంశెట్టి నాగేంద్ర, సవరం సుబ్బారావు, వడ్లానపూ .జగన్నాథం, ఉపాధి హామీ కూలీలు, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## యూరియా అన్‌లోడింగ్ ప్రక్రియపై డీసీపీ ఆరా!!

- లారీ అసోసియేషన్, అధికారులతో కీలక చర్చలు
- యూరియా సరఫరాలో ఆటంకాలు ఉండకూడదు
- హమాలీల కోసం ప్రత్యేక చలివేంద్రం ప్రారంభం

**పెద్దపల్లి బ్యూరో, మే 21 (డిడి9 వార్త):**
పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో యూరియా బస్తాల అన్‌లోడింగ్ ప్రక్రియను, ధాన్యం రవాణా సవాళ్లను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణాతో పాటు యూరియా రవాణాకు లారీల కొరత ఏర్పడుతుండటంతో, దీనిపై రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు, వివిధ జిల్లాల లారీ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ధాన్యం రవాణాతో పాటు యూరియా సరఫరాకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను డీసీపీ ఆదేశించారు.

హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్న డీసీపీ, వారు ఎండలో పడుతున్న ఇబ్బందులను గుర్తించి పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చలివేంద్రాన్ని ప్రారంభించారు. శాఖల మధ్య సమన్వయం ఉంటేనే రైతులకు మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ ప్రతినిధులు కూడా రవాణా సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. డీసీపీ ఆదేశాలతో అధికారులు తక్షణమే కార్యాచరణ సిద్ధం చేసి, యూరియా బస్తాల రవాణా వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, నరేష్, వివిధ శాఖల అధికారులు, హమాలీలు పాల్గొన్నారు.



## రాజీవ్ గాంధీ ఆశయాలతో కాంగ్రెస్ ముందుకు సాగుతుంది లింగాల జగదీష్ చందర్ రెడ్డి

**జనగామ మే 21(డిడి 9వార్త ) బ్యూరో**
మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రఘునాథపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అలాగే రఘునాథపల్లి బస్టాండ్ ఆవరణలో ప్రజలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోళ్ల రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ ఆధునికీకరణకు పునాది వేసిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ప్రజాసేవే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కడారి రవి , మార్కెట్ డైరెక్టర్ సిద్ధేశ్, జిల్లా నాయకులు గాదే మహేందర్ రెడ్డి, మేకల నరేందర్, కాసార్ల లక్ష్మయ్య ఎండి ఇబ్రహీం, నీలం యువరాజ్, సర్పంచులు, వార్డు సభ్యులు,మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో భద్రగిరి ప్రదక్షణ భక్తరామదాసు

- తూము లక్ష్మీ నరసింహ దాసులకు ప్రత్యేక పూజలు



**భద్రాచలం , మే 21 , డిడి9 వార్త**
భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం, భక్త రామదాసు ట్రస్టు కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో గురువారం శ్రీరామ చంద్రుని జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకొని భద్రగిరి ప్రదక్షణ నిర్వహించారు. తొలుత ఆలయంలో దృవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గిరి ప్రదిక్షణకు బయలుదేరారు. శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ భక్తులు ఆలపిస్తుండగా మేళతాళాల మధ్య గిరిప్రదిక్షణ కొనసాగింది. ఈ క్రమంలో విస్తా కాంప్లెక్సు వద్ద ఉన్న తూము లక్ష్మీనరసింహదాసు విగ్రహం వద్ద దేవస్థానం వైదిక సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదిక్షణ ముందుకు సాగింది. తదుపరి ఉత్తరద్వారం వద్ద ఉన్న భక్తరామదాసు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిప్రదిక్షణ రాజవీధి మీదుగా రామాలయంకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

**రామయ్యకు నిత్యకల్యాణం**
భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యహావచనం, కంకణ దారణ, జీలకరబెల్లం, మాంగల్యాదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## ఎద్దు ఏడిసిన వ్యవసాయం...రైతు ఏడిసిన రాజ్యం బాగుపడదు

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- తహసీల్దార్‌కు బీజేపీ అంతర్గం మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ వినతి పత్రం



**పెద్దపల్లి బ్యూరో, మే 21 (డిడి9 వార్త):**
అంతర్గం మండలంలోని ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.

బోడకుంట సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, రామగుండం నియోజకవర్గ ఇంచార్జి కందుల సంధ్యారాణి, జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి ఆదేశాల మేరకు జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..., కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అధికారులు, మిల్లర్లు కలిసి "బికేటగిరి" పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యంలో తేమ శాతం పేరుతో అనవసర కోతలు విధించడం, "తాలు", "తరుగు" పేరుతో దోపిడీ చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో వర్షాలు వస్తే ధాన్యం తడిసి రైతులు మరింత నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతి కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగితే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలసాని సత్యం గౌడ్, తమ్మినవేని మల్లేష్, మాడ ప్రభాకర్ రెడ్డి, మీడివెల్లి అంజి, దుంపేటి రాజు, అయిత నవీన్, గోలివాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్జీ1 ఏరియాలో ఘనంగా ముగిసిన సింగరేణి వేసవి క్రీడా శిక్షణా శిబిరం

- క్రీడాకారులకు టీ-షర్టులు పంపిణీ చేసిన జీఎం డి. లలిత్ కుమార్
- సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలి : జీఎం పిలుపు

**పెద్దపల్లి బ్యూరో, మే 21 (డిడి9 వార్త):**
వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామగుండం ఏరియా 1 పరిధిలో సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు మరియు పరిసర ప్రాంతాల బాలబాలికల కోసం స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరం ఘనంగా ముగిసింది.

ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి. లలిత్ కుమార్, అనిత లలిత్ కుమార్, విశిష్ట అతిథిగా మద్దీ ఎల్లయ్య హాజరయ్యారు. శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసిన క్రీడాకారులకు జీఎం ఉచితంగా టీషర్టులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జీఎం డి. లలిత్ కుమార్ మాట్లాడుతూ..., వేసవి సెలవుల్లో నిర్వహించిన ఈ క్రీడా శిక్షణ బాలబాలికల మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. క్రీడలు జీవితంలో పట్టుదల, క్రమశిక్షణ, పోటీ తత్వం, గెలుపొందాలనే సంకల్పాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

గతంలో పిల్లలు వేసవి సెలవుల్లో కొత్త విషయాలు నేర్చుకుంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకునేవారని, కానీ ప్రస్తుతం డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్‌లు, టీవీలకే పరిమితం కావడంతో క్రీడలపై ఆసక్తి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు తమ సమయాన్ని క్రీడలకు కేటాయిస్తే, అది వారి భావి జీవితానికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈ వేసవి శిక్షణా శిబిరంలో ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, బాక్సింగ్, కరాటే వంటి విభాగాల్లో అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన పిల్లలు భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, పెరుమాళ్ళ రజిత, హనుమంతరావు, హెచ్. రమేష్, సామల సత్యనారాయణ, కోచ్‌లు మొండయ్య, షబానా, వెంకటేష్, రవితేజ, అనిల్ కుమార్, నవీన్ తదితరులు, పెద్ద సంఖ్యలో బాలబాలికలు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# జీడీకే11 ఇంక్లైన్ గనిపై మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశం

- సింగరేణి లక్ష్యాల సాధనే ధ్యేయం
- ఉత్పత్తి, భద్రత, కార్మిక సంక్షేమంపై సమగ్ర చర్చ
- ఆధునిక యంత్రాలతో పూర్తి స్థాయి ఉత్పాదకత సాధించాలని జీఎం సూచన
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వారం రోజుల్లో చర్యలు : జీఎం డి. లలిత్ కుమార్

పెద్దపల్లి బ్యూరో, మే 21 (డిడి9 వార్త):

సింగరేణి సంస్థ నిర్దేశిత లక్ష్యాలను సాధించడమే లక్ష్యంగా, సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు రామగుండం ఏరియా 1 పరిధిలోని జీడీకే 11 ఇంక్లైన్ గనిపై ఈరోజు మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డి. లలిత్ కుమార్ వివిధ విభాగాల పనితీరును సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ సాధించిన బొగ్గు ఉత్పత్తి, కార్మిక సంక్షేమం, గనుల్లో భద్రతా ప్రమాణాలు, 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలు, మార్కెట్ సవాళ్లపై సమగ్రంగా వివరించారు. గనుల పనితీరు, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, నెలవారీ లక్ష్యాల సాధనకు రూపొందించిన కార్యాచరణపై అధికారులు చర్చించారు.

ప్రత్యేకించి జీఎం డి. లలిత్ కుమార్ మాట్లాడుతూ... గనిలో ఎల్‌హెచ్‌డీ , ఎస్‌డీఎల్ , కంటిన్యూస్ మైనర్ వంటి ఆధునిక యంత్రాలతో పనులు నిర్వహిస్తున్నప్పటికీ, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి స్థాయి ఉత్పత్తి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులు, కార్మికులను ఆదేశించారు.

ఉద్యోగులతో ముఖాముఖి – సమస్యల పరిష్కారానికి హామీ

సమావేశం అనంతరం జీఎం ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉద్యోగులు పలు సాంకేతిక, నిర్వహణ సంబంధిత సమస్యలను జీఎం దృష్టికి తీసుకురాగా, వాటిపై స్పందించిన ఆయన వారం రోజుల్లో అవసరమైన సామాగ్రి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

యంత్రాల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకొని నిర్దేశిత పని గంటల పాటు యంత్రాలు నిరంతరాయంగా నడిచేలా చూడాలని సూచించారు. దీనిపై స్పందించిన కార్మికులు, అవసరమైన పరికరాలు సమకూరితే పూర్తి సమయం వెచ్చించి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మడ్డి ఎల్లయ్య, ఆంజనేయులు, రామ్మోహన్, చిలుక శ్రీనివాస్, బి. మల్లేష్, అధికారులు, కార్మికులు, పెద్ద సంఖ్యలో గని ఉద్యోగులు పాల్గొన్నారు.

# రచ్చ గుట్టలో మట్టి మాఫియా పంజా!!

- ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణ
- కోర్టు స్టే ఉన్నా ఆగని తవ్వకాలు
- రూ.20 కోట్ల విలువైన సహజ వనరుల దోపిడీ
- చర్యలు తీసుకోకుంటే న్యాయపోరాటం
- ప్రజల సంపదను కాపాడుకుంటాం : బీఆర్ఎస్ నేత వ్యాల్ల హరీష్ రెడ్డి



పెద్దపల్లి బ్యూరో, మే 21 (డిడి9 వార్త):

రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలం పెద్దంపేట రచ్చ గుట్టలో కోర్టు నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ, స్థానిక ఎమ్మెల్యే అండదండలతో యథేచ్ఛగా మట్టి దోపిడీ జరుగుతోందని వ్యాల్ల హరీష్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు.

స్థానిక నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, ఎటువంటి అనుమతులు లేకుండానే సుమారు రూ.20 కోట్ల విలువైన మట్టిని అక్రమంగా తరలిస్తూ పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్నారని మండిపడ్డారు. గతంలో లింగాపూర్‌లో ఇదే తరహా అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యే, ఇప్పుడు అధికార గర్వంతో ప్రభుత్వ యంత్రాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

రోడ్డు విస్తరణ పనుల పేరుతో సాగుతున్న ఈ దౌర్జన్యకాండపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయపరంగా కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. సహజ వనరులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధి స్వార్థ ప్రయోజనాల కోసం గుట్టలను కరిగించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రానున్న కాలంలో ప్రజలు, రైతులు ఇలాంటి అవినీతి పాలనకు తప్పకుండా బుద్ధి చెబుతారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆముల పెద్ద శ్రీనివాస్, స్థానిక బీఆర్ఎస్ ముఖ్య నేతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామని హరీష్ రెడ్డి తెలిపారు.

# రఘునాథపల్లిలో “చలో హైదరాబాద్ మహా ధర్నా” పోస్టర్ల ఆవిష్కరణ

జనగామ may21(డిడి 9వార్త ) బ్యూరో



రఘునాథపల్లి మండల కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో “చలో హైదరాబాద్ మహా ధర్నా” కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 26న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు బానోత్ బిక్షపతి నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జి కొర్ర రాజేందర్ నాయక్ మాట్లాడుతూ, గిరిజన హక్కుల సాధనలో ఎల్‌హెచ్‌పీఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో మండల, తండా నాయకులు పాల్గొన్నారు.



# రాజీవ్ గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తి : ఎంపీ డాక్టర్ కడియం కావ్య

జనగామ మే 21(డిడి 9వార్త ) బ్యూరో

భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు Dr. కడియం కావ్య హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంజీఎం సర్కిల్‌లో మరియు గీసుగొండ మండలం కోనాయిమాకుల వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అలాగే గీసుగొండ మండలం కె.యం.టి.పీ రెసిడెన్షియల్ లేఅవుట్ గ్రామంలో రూ.58 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయని రాజేందర్ రెడ్డి , రేవూరి ప్రకాష్ రెడ్డి , దొంతి మాధవ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు ఇనగల వెంకట్రాంరెడ్డి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, దేశాన్ని ఆధునిక భారతంగా తీర్చిదిద్దడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. సమాచార సాంకేతిక రంగం, టెలికాం విప్లవానికి ఆయన బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రజల మధ్య ఉండే నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. దేశ ప్రజలకు ప్రత్యామ్నాయ ఆశగా ఆయన ఎదుగుతున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మొరుమూరు జీపీ ప్రగలపల్లి గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహణ

వాజేడు మే 21 (డిడి9 వార్త):•

ములుగు జిల్లా వాజేడు మండలం మొరుమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రగలపల్లి గ్రామంలో సబ్ సెంటర్ వద్ద హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ హెల్త్ క్యాంపులో గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడకం సుభద్ర, డాక్టర్ గ్యానస్, ఆశా వర్కర్లు, సీహెచ్ సూర్య ప్రకాష్, వెంకట్, కన్యాకుమారి పాల్గొన్నారు. గ్రామ ప్రజలు హెల్త్ క్యాంపును వినియోగించుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.



## పక్షుల దాహార్తి తీర్చేందుకు నీటి కుండలు ఏర్పాటు

- సర్పంచ్ నిర్మల ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం



**గోవిందరావుపేట, మే 21 (డి డి 9 వార్త):**

మండుటెండల్లో నీటి కోసం అల్లాడుతున్న పక్షులకు చల్లని ఊరట కల్పించేలా గాంధీనగర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పక్షుల దాహార్తి తీర్చేందుకు నీటి కుండలను ఏర్పాటు చేశారు.

గ్రామ సర్పంచ్ బానోత్, నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో చెట్ల వద్ద, పక్షులు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో నీటి పాత్రలను ఏర్పాటు చేయడంతో స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పక్షులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ నిర్మల తెలిపారు.

ప్రకృతి పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, మూగజీవాల పట్ల మానవత్వాన్ని చాటుతోంది. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద చిన్న పాత్రల్లో నీరు ఉంచి పక్షులకు సహాయం చేయాలని గ్రామ పంచాయతీ సభ్యులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ఉద్యమకారుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం చారిత్రాత్మకం

- తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఏర్పాటు పై హర్షం వ్యక్తం చేసిన "రెడ్డి సంధ్యారెడ్డి"

**గోవిందరావుపేట, మే 21 (డి డి 9 వార్త):**

తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా కో కన్వీనర్, రెడ్డి సంధ్యారెడ్డి పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాలయాపన లేకుండా వెంటనే అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.ములుగు జిల్లాలోని గోవిందరావుపేట మండలం పసర గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి, అలాగే ఉద్యమకారుల ఉన్నత స్థాయి కమిటీ సభ్యులకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 679 ద్వారా ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కమిటీ చైర్మన్‌గా నియమితులైన కే. కేశవరావు తో పాటు కమిటీ సభ్యులైన పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డిలకు పాలాభిషేకం చేసి అభినందనలు తెలిపారు.గత తొమ్మిది సంవత్సరాలుగా డాక్టర్ సీమ శ్రీనివాస్, నందగిరి రజినీకాంత్ అడ్వకేట్ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాలు, పోరాటాల ఫలితంగానే ఈ కమిటీ ఏర్పాటు సాధ్యమైందని సంధ్యారెడ్డి పేర్కొన్నారు. కమిటీ ద్వారా ఉద్యమకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ముఖ్య సలహాదారు కొండి రమేష్, వల్లపు రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా కో కన్వీనర్ రేగుల మల్లమ్మ, నిమ్మల సుహాసిని, దేవరపల్లి శకుంతల, పిట్టల భాగ్యలక్ష్మి, ఏనే సరిత, పిట్టల గీత, కొండి సుజాత, తుక్కాని సుగుణ, తుక్కాని సుజాత పాల్గొన్నారు.

## హన్మకొండలో బిఆర్ఎస్ వ్యూహాత్మక సమావేశం

- వడ్ల, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల దుస్థితిపై మండిపడ్డ ఎమ్మెల్యే పల్లా
- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే ఎత్తాలి
- ప్రభుత్వం రైతాంగాన్ని కాపాడాలి
- బిఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు సిద్ధం కావాలి
- ఎస్ఐఆర్ ద్వారా అర్హుల ఓట్లు తొలగిపోకూడదు
- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



**జనగామ మే 21 (డిడి 9వార్త )బ్యూరో**

హన్మకొండ జిల్లాలో గురువారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకుల వ్యూహాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హన్మకొండ, వరంగల్, జనగామ జిల్లాలకు చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,

మాజీ ఎమ్మెల్యే లు దాస్యం వినయ్ భాస్కర్, నన్నెపునేని నరేందర్, ఆరూరి రమేష్, పెద్ది సుదర్శన్ రెడ్డి, తాటికొండ రాజయ్య, నియోజక వర్గ ఇన్‌చార్జీలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరై వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల దుస్థితి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, జిల్లా పార్టీ కార్యాచరణపై విస్తృతంగా చర్చిం చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింద న్నారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్లు, మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయాయని తెలిపారు. ఎక్కడ చూసినా బస్తాల కొరత ఉందని, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని విమర్శించారు. ఇప్పటికే లిఫ్ట్ చేసిన ధాన్యాన్ని కూడా అన్‌లోడ్ చేయకుండా నిల్వ ఉంచుతున్నారని అన్నారు. ధాన్యం దించేందుకు కూలీల సమస్య తీవ్రంగా ఉందని, రాష్ట్రంలోని అన్ని ఐకేపీ కేంద్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని పేర్కొన్నారు.

కోటి మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు 25 శాతం కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. రైతులు పండించిన పంట కొనుగోలు కాక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. ఒకవైపు వడదెబ్బలు, మరోవైపు గుండెపోటులతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అత్యవసర చర్యలు తీసుకుని ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

ఇటీవల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన రైతు సభతో ప్రభుత్వంలో కొంత కదలిక వచ్చిందని పల్లా గారు గుర్తు చేశారు. ఆ సభ తర్వాత అధికారులు, పాలకుల్లో కొంత హడావుడి కనిపించిందన్నారు. కానీ అనంతరం పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చిందని విమర్శించారు. ప్రస్తుతం ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్టుగా ఐకేపీ కేంద్రాల్లో సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని అన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. రైతుల ధాన్యం చివరి గింజ కొనుగోలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం ఆగదని పల్లా గారు స్పష్టం చేశారు. రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

అలాగే రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని పల్లా గారు పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో ఇద్దరిని గుర్తించి వారికి సభ్యత్వ నమోదు ప్రక్రియపై శిక్షణ ఇస్తామని తెలిపారు. కేంద్రం జూన్ 25 నుంచి చేపట్టనున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో అర్హుల ఓట్లు తొలగిపోకూడదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ డిజిటల్ విధానంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం ప్రతి బూత్‌లో ఇద్దరిని గుర్తించడం జరుగుతుందని, వారికి జూన్ మొదటి వారంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. బిఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు అనేక మంది ఉత్సాహం చూపుతున్నారని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## భద్రాచలంలో గంజాయి పట్టివేత..

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- నిందితులకు రిమాండ్ కు తరలింపు
- నిందితుల వివరాలు వెల్లడించిన డీఎస్పీ అరుణ్ కుమార్




**భద్రాచలం టౌన్, మే 21 డిడి9 వార్త**

భద్రాచలం పట్టణ పరిధిలో పోలీసులు బుధవారం రాత్రి జరిపిన వాహనాల తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిస్సా నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ. 6,46,400 విలువైన 12.928 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసుల కథనం ప్రకారం..**

భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పట్టణ ఎస్ఐ పి.శ్యాం ప్రసాద్ తన సిబ్బందితో కలిసి భద్రాచలం ఊరి చివరన ఉన్న కొల్లుగూడెం వెళ్లే ర్యాంప్ వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కూనవరం రోడ్ వైపు నుండి భద్రాచలం వైపు వస్తున్న ఒక మోటార్ సైకిల్‌ను ఆపి తనిఖీ చేశారు. బైక్‌పై ఉన్న భద్రాచలంకు చెందిన మురళీకృష్ణ, దుమ్ముగూడెం మండలానికి చెందిన గుండి వంశీకృష్ణ, తెల్లం ముఖేష్‌లను విచారించగా అనుమానాస్పద సమాధానాలు చెప్పారు.దీంతో వారి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించగా.. రెండు ప్యాకెట్లలో ప్యాక్ చేసి ఉన్న 12.928 కేజీల ప్రభుత్వ నిషేధిత గంజాయి లభ్యమైంది. ఒడిస్సాకు చెందిన విక్రమ్, శంకర్ అనే వ్యక్తుల వద్ద దీనిని కొనుగోలు చేసి భద్రాచలం తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. పంచనామా నిర్వహించి రూ. 6.46 లక్షల విలువైన గంజాయితో పాటు, రవాణాకు ఉపయోగించిన మోటార్ సైకిల్, నిందితుల వద్ద ఉన్న రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, భద్రాచలం టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ వి.సతీష్ కేసు నమోదు చేశారు. దుమ్ముగూడెం ఇన్స్పెక్టర్, భద్రాచలం ఇంచార్జ్ అయిన వెంకటప్పయ్య నిందితులను రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు.

తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి: డీఎస్పీ

ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా చేసేవారిపై, విక్రయించే వారిపై, అలాగే వారికి సహకరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచి, వారు వ్యసనాలకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ గురించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ స్పష్టం చేశారు.

## మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసిన పెరుమాండ్ల వెంకటేశ్వర్లు

**జనగామ,మే21(డిడి9వార్త) బ్యూరో**

జఫర్గడ్ మండలం వడ్డెగూడెం గ్రామానికి చెందిన కుక్కల రాజేందర్ మృతితో వారి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# హెల్త్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహణ...

**మే21 డిడి9 వార్త వెంకటాపురం.**

ప్రధానమంత్రి జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా, జిల్లా అధికారులు మరియు ఏటూరునాగారం ఐటిడిఏ పిఓ, ఆదేశాల మేరకు వెంకటాపురం మండలం ఏదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భారీ మూల గిరిజన గ్రామమైన మొర్రవానిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గురువారం హెల్త్ స్క్రీనింగ్ మరియు వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఎదిర వైద్యాధికారి డాక్టర్ భాస్కర్, సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించడంతోపాటు గర్భిణీలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు, జ్వరం వచ్చిన వ్యక్తుల నుంచి రక్తపూత నమోనాలను సేకరించి ఆర్టీటీ నివారణ పరీక్షలు చేపట్టారు. అలాగే బిపి, షుగర్ బాధితులకు నెలవారి మందులను అందజేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలను తప్పనిసరిగా వినియోగించాలని వైద్యాధికారి అవగాహన కల్పించారు. వేడి ప్రభావం నుంచి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రతపై పస్రా ఎస్సై తాజుద్దీన్ హెచ్చరిక

**గోవిందరావుపేట, మే 21( డి డి 9 వార్త)**



తెలుగు రాష్ట్రాల్లో రోజు రోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పస్రా ఎస్సై తాజుద్దీన్ సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. వడదెబ్బ, నీరసం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు మధ్యాహ్న వేళల్లో బయట సంచరించకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

తాగునీరు ఎక్కువగా తీసుకోవడంతో పాటు అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లాలని ఎస్సై తాజుద్దీన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# లబ్ధిదారులకు ₹1,50,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు.మే 21 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా, మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నాడు నిర్వహించిన కార్యక్రమంలో అశ్వాపురం మండలానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు మొత్తం ₹ 1,50,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సహాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిన ఆర్థిక సహాయం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉందని లబ్ధిదారులు ఎమ్మెల్యే పాయం కు మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఓరుగంటి రమేష్, గాదె కేశవరెడ్డి, వేముల విజయ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ చాలెంజ్ ఫండ్‌లో వరంగల్‌కు రూ.4,674 కోట్లు : వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

**జనగామ మే 21(డిడి 9 వార్త) బ్యూరో**

కేంద్రం ఆమోదంతో నగరాభివృద్ధికి భారీ ఊతం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అర్బన్ చాలెంజ్ ఫండ్ (UCF) కింద వరంగల్ నగరానికి రూ.4,674 కోట్ల భారీ నిధులు మంజూరైనట్లు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు.

తెలంగాణకు ఆమోదమైన మూడు ప్రాజెక్టులకు మొత్తం రూ.5,681 కోట్లు కేటాయించగా, అందులో అత్యధిక భాగం వరంగల్‌కే దక్కడం రాష్ట్ర ప్రభుత్వ కృషికి నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు. ఈ నిధులతో నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, వరద నివారణ పనులు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు అమల్లోకి వస్తే వరంగల్ నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, ప్రజలకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్ద సమర్థవంతంగా ప్రతిపాదనలు ఉంచి ఈ నిధులు సాధించిందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. పట్టణాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి ఫలితంగానే వరంగల్‌కు ఈ స్థాయి నిధులు లభించడం జరిగిందన్నారు.

ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 50 శాతం నిధులు సమకూర్చనున్నాయని, మిగతా భాగం హడ్కో రుణాల ద్వారా సమీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత వరంగల్ ఆధునిక నగరంగా రూపుదిద్దుకోనుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.



# నీతి,నిజాయితీ,నిబద్ధత కలిగిన నిస్వార్థ నాయకుడు మిరియాల రాజిరెడ్డి పనితీరుకు పట్టం కట్టిన బి ఆర్ యస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు..

- **పార్టీ సభ్యత్వ నమోదు లో బెల్లంపల్లి జిల్లా ఇన్ ఛార్జ్ గా రాజిరెడ్డి నియామకం బాధ్యత ఉత్తర్వులు విడుదల..**
- **హర్షం వ్యక్తం చేసిన ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**



**మణుగూరు.మే 21 (డి డి 9వార్త)**

చిన్న తనం నుండే అభ్యుదయ భావాలు కలిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర ను పోషిస్తూనే సింగరేణి సంస్థ ప్రగతి, కార్మిక సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా అనేక పోరాటాలు చేశారు సింగరేణి కార్మిక గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అలాంటి నిస్వార్థ సేవలు అందించే కార్మిక పక్షపాతి మిరియాల రాజిరెడ్డి పనితీరును మెచ్చి బి ఆర్ యస్ పార్టీ సభ్యత్వ నమోదు బెల్లంపల్లి జిల్లా ఇన్ చార్జి బాధ్యతలు అప్పగిస్తు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు, బి ఆర్ యస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు గురువారం నాడు ఉత్తర్వులు విడుదల చేయడం సంతోషకరమైన అంశం అని మణుగూరు ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు . సింగరేణి లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘ ఆవిర్భావానికి ఆయన ఒక సమిధ టి బి జి కె యస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ దిశా నిర్దేశం ద్వారా సింగరేణి లో టి బి జి కె యస్. ను రాజిరెడ్డి నాయకత్వంలో ఒక బలమైన శక్తిగా తయారు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఆయన క్రమశిక్షణ, పట్టుదల, కృషి, నీతి నిజాయితీనే నేడు బి ఆర్ యస్ పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్ చార్జి ఎంపికకు దోహదపడ్డాయని తెలిపారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, మహా పురుషులవుతారు అనే పదానికి మిర్యాల. రాజిరెడ్డి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తారని ఆయన తెలియచేశారు.

ఆయన ఓర్పు,నేర్పు రానున్న భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కు రాష్ట్ర రథసారథిగా నాయకుడిగా ఉండి యూనియన్ బలోపేతం లో ఆయన నిబద్ధత, నిస్వార్థ సేవలు ఎన్నటికి మరువలేనివని, రానున్న రోజుల్లో ప్రజా, కార్మిక క్షేత్రంలో ఉండి మరిన్ని సేవలు అందించడానికి బి ఆర్ యస్ పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్ చార్జి బాధ్యతలు ఎంతగానో దోహద పడతాయని ఈ సందర్భంగా ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బి ఆర్ యస్ పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్ చార్జిగా బాధ్యతలు అందించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు తోడ్పాటు అందించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు, టి బి జి కె యస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ కు, కోల్ బెల్ట్ ప్రజా ప్రతినిధులకు ప్రతి ఒక్కరికి పేరు పేరు న మణుగూరు టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.